# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-05-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాలపై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత సైన్యం మెరుపు దాడులు చేపట్టింది.**

**2.** **పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ రోజు దేశ వ్యాప్తంగా పౌర రక్షణ మాక్ డ్రిల్‌ను నిర్వహించనుంది.**

**3.** **భారతదేశ జలాలను ఇకపై దేశ ప్రయోజనాలకు ఉపయోగిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.**

**4.** **అమరావతిలో నిర్మించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల కార్యాలయాలు వైవిధ్యంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.**

**5.** **తెలంగాణలో రాబోయే 50 ఏళ్ల అవసరాలకు తగినట్లుగా రీజినల్ రింగ్‌రోడ్డు, ఇతర రహదారులను నిర్మిస్తామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు.**

==========================

పహల్గాం ఉగ్రదాడికి సమాధానంగా భారత్ ప్రతీకార చర్యలు చేపట్టింది. గత అర్ధరాత్రి 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ పీఓకేలోని ఉగ్రస్థావరాలపై భారత సైన్యం మెరుపు దాడులు జరిపింది. భారత సైనిక, నావిక, వాయు దళ బలగాలు సంయుక్తంగా ఈ దాడిని నిర్వహించాయి. మొత్తం తొమ్మిది స్థావరాలపై భారత సైన్యం పూర్తి కచ్చితత్వంతో దాడులు చేసినట్లు పేర్కొంది. పాకిస్థాన్ సైనిక స్థావరాలపై ఎక్కడా దాడులు చేపట్టలేదని భారత ప్రభుత్వం పేర్కొంది. అనంతరం.. ఆపరేషన్ సిందూర్‌పై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సహా పలువురు కేంద్ర మంత్రులు, ప్రముఖులు 'భారత్ మాతా కీ జై' అని సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేస్తున్నారు.

కాగా దాడులపై పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని రక్షణ శాఖ పేర్కొంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ దాడులపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

--------------------------

జమ్మూకాశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ రోజు దేశ వ్యాప్తంగా పౌర రక్షణ మాక్ డ్రిల్‌ను నిర్వహించనుంది. దేశంలోని అన్ని రాష్ట్రాలతోపాటు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ మాక్ డ్రిల్ నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మొత్తం 244 జిల్లాలలో మెట్రోలు, రక్షణ సంస్థలు,

కీలక ప్రాజెక్టుల రక్షణపై ఈ మాక్ డ్రిల్ జరగనుంది. ఈ సందర్భంగా దాడులకు అవకాశం ఉన్న జిల్లాలను మూడు విభాగాలుగా విభజించారు. ఇందులో 2 వ కేటగిరి కింద తెలుగు రాష్ట్రాలలోని హైదరాబాద్, విశాఖపట్నంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంపై అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో కేంద్ర హెం శాఖ కార్యదర్శి నిన్న సమీక్ష నిర్వహించారు. కాగా 1971లో భారత్, పాకిస్తాన్ యుద్ధం సందర్భంగా పౌర రక్షణ మాక్ డ్రిల్ నిర్వహించారు.

---------------------------

భారతదేశ జలాలను ఇకపై దేశ ప్రయోజనాలకు ఉపయోగిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఢిల్లీలో ఒక ప్రయివేట్ ఛానల్ నిర్వహించిన ఇండియాఏ2047 కార్యక్రమంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ, దేశ జల వనరులను సంరక్షించడంతో పాటు వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దేశం నుండి బయటకు ప్రవహిస్తున్న నీటిని ఇకపై దేశీయంగా ఉపయోగించుకుంటామని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్.. 32 సెకన్లు

---------------------------

అమరావతిలో నిర్మించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల, ప్రైవేటు సంస్థల కార్యాలయాలు వైవిధ్యంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ–సీఆర్‌డీఏ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజధాని నిర్మాణం భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

---------------------------

రాజధాని అమరావతిలో ఇప్పటి వరకు 71 సంస్థలకు ఒక వెయ్యి 50 ఎకరాలను కేటాయించామని ఆంధ్రప్రదేశ్ పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రాజధానిలో భూ కేటాయింపులపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం నిన్న సమావేశమైంది. అనంతరం సమావేశ నిర్ణయాలను మంత్రి పాత్రికేయులకు వెల్లడిస్తూ,

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

తెలంగాణలో రాబోయే 50 ఏళ్ల అవసరాలకు తగినట్లుగా రీజినల్ రింగ్‌రోడ్డు, ఇతర రహదారులను నిర్మించనున్నామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. రహదారులు, భవనాలు ఆర్‌అండ్‌బీ శాఖపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి నివాసంలో గత రాత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రహదారులు నిర్మించే అటవీప్రాంతం, జలవనరులు, మండలకేంద్రాలు, గ్రామాల విషయంలో ముందుగానే లైడార్ సర్వే చేపట్టాలని ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు నుంచి కొత్త రేషన్‌కార్డుల జారీకి దరఖాస్తులు స్వీకరిస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈకేవైసీ ప్రక్రియ వల్ల కొత్త రేషన్ కార్డుల జారీ ఆలస్యమైందని చెప్పారు. ఈ రోజు నుంచి కొత్త కార్డులతో పాటు, మార్పులు, చేర్పులు, చిరునామా మార్చుకోవచ్చని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

వ్యవసాయానికి వినియోగించేలా వెయ్యి మెగా వాట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఢిల్లీలో కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో ఆయన నిన్న సమావేశమైయ్యారు. అనంతరం ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ,

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే సంయుక్త ప్రవేశ పరీక్ష –ఏపీ ఐసెట్ 2025 ఈరోజు జరుగుతుంది. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 109, హైదరాబాద్‌లో 1 పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు.

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్–ఐపీఎల్‌లో భాగంగా కోల్‌కతా వేదికగా ఈరోజు చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరగనుంది. కాగా నిన్న ముంబై వేదికగా గుజరాత్ టైటాన్స్, ముంబై ఇండియన్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో గుజరాత్ 3 వికెట్ల తేడాతో ముం

---------------------------

అల్పపీడన ద్రోణి, వాతావరణ అనిశ్చితి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలకు అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. పిడుగులు పడటంతో పాటు, గంటకు 50 నుంచి 60 కి.మీ. వేగంతో ఈదురుగాలులూ వీసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ,

వాయిస్.. 30 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలకు అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================